పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కొత్తవలస పోలీసు స్టేషనులో నమోదైన పోక్సో కేసులో నిందితుడు కొత్తవలస మండలం జోడుమెరక గ్రామానికి చెందిన జోడు అప్పన్న (32)కు విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2,500 జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరు చేస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. జోడుమెరక గ్రామానికి చెందిన నిందితుడు జోడు అప్పన్న ఈ ఏడాది మే 21న అదే గ్రామంలో వేసవి సెలవులకు చిన్నాన్న ఇంటికి వచ్చిన ఒక బాలిక (6)కు చాక్లెట్ ఇచ్చి పాడుబడిన ఇంట్లోకి తీసుకొని వెళ్ళి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కొత్తవలస పోలీసు స్టేషను సిఐ సిహెచ్ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. అప్పటి విజయనగరం డిఎస్పి ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ధాన్యం కొనుగోలులో బీజీల డ్రామా

- అదనపు ధాన్యం దోపిడీకి కొత్త ఎత్తుగడ
- ట్రక్ షీటు లేకుండా మిల్లులకు ధాన్యం
- రాత్రిపూట దళారుల ధాన్యానికి ట్రక్ షీట్లు
- కొనుగోలు సిబ్బందితో కుమ్మక్కు
- యథేచ్ఛగా ధాన్యం దోపిడీ

బీజీలు లేకపోవడంతో కల్లాల్లో ఉన్న ధాన్యం

ప్రజాశక్తి - జామి

ధాన్యం కొనుగోలులో దోపిడీకి మిల్లర్లు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఎలాగోలా తామనుకున్న అదనపు ధాన్యాన్ని రైతుల నుంచి లూటీ చేస్తూనే ఉన్నారు. తాజాగా మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ (బిజి)లు లేవన్న కొత్త డ్రామాకు తెరలేపారు. రైతు సేవా కేంద్రాలకు వెళుతున్న రైతులకు తొలి దశలో మిల్లులకు బీజీలు లేవని చెప్పి, ట్రక్ షీట్లు లేకుండా చేశారు. దీంతో పొలంలో ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు ఒకటి రెండు రోజులు నిలిచి పోతున్న పరిస్థితి ఎదురవుతోంది. ఈ సమయంలో అప్పటికే మిల్లర్లు సిద్ధం చేసిన దళారులు రంగ ప్రవేశం చేస్తున్నారు. అదనపు ధాన్యం ఒప్పందానికి సిద్ధపడ్డ రైతులను గుర్తిస్తున్నారు. అనివార్యంగా కొంతమంది రైతులు కూడా పొలాల్లో కాపలా కాయలేక అదనపు ధాన్యం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. రాత్రికి రాత్రి అదనపు ధాన్యం ఇవ్వడానికి అంగీకరించిన రైతులకు ట్రక్‌షీట్లను కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది సాయంతో జనరేట్ చేస్తున్నారు. దీంతో అనివార్యంగా రైతు నుంచి అదనపు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు రావు. పైగా పొలాల్లో ఒకటి రెండు రోజులు పడిగాపులు కాస్తున్న రైతులకు మేలు చేస్తున్నట్లు మాయచేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలా తామనుకున్న ధాన్యం దోపిడీకి మిల్లర్లు శ్రీకారం చుడితే, దానికి అధికారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది సహకరిస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు.

గత ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దందా అడ్డూ అదుపూ లేకుండా పోయిన విషయం తెలిసిందే. గతంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల విషయంలో రూ.కోట్లు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వినిపించాయి. కానీ ఈసారి అదనపు ధాన్యం దోపిడీకి ఏకంగా బ్యాంకు గ్యారంటీల డ్రామాను తెరపైకి తీసుకొచ్చారు. సాధారణంగా మిల్లర్లు కొంత బ్యాంకు గ్యారంటీ చూపించి ధాన్యం కొనుగోలు చేస్తారు. బీజీ ఉన్న మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తారు. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి, ప్రభుత్వానికి సరఫరా చేస్తే, ఉన్న బ్యాంకు గ్యారంటీలు పదిలంగా ఉంటాయి. ఇక్కడే మిల్లర్లు వేసిన ఎత్తుగడ రైతుల అదనపు ధాన్యం కొల్లగొట్టేందుకు వీలుగా మార్చుకున్నారు. బీజీల పేరుతో కొనుగోలులో జాప్యం చేస్తే, రైతులు అనివార్యంగా చెప్పినట్టు వింటారని భావించారు. అందులో భాగంగానే జామి మండలంలో రైతులు ప్రతి రోజూ ట్రక్ షీట్ల కోసం రైతు సేవా కేంద్రాల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఇలా కొంతమేరకు మాత్రమే బీజీలు వచ్చినట్లు బియ్యం సరఫరా చేసి, కొద్దిపాటి బీజీల మేరకు రాత్రికి రాత్రి దళారుల ద్వారా ఒప్పందం చేసుకున్న రైతుల ట్రక్‌షీట్లను జనరేట్ చేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా అదనపు ధాన్యం దోపిడీ జరుగుతోందని రైతులు, రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

బీజీల డ్రామా పై సమగ్ర విచారణ జరపాలి

జిల్లాలో మిల్లర్లు బీజీలను జాప్యం చేస్తూ అదనపు ధాన్యం దోపిడీ చేస్తున్నారు. బీజీల కృత్రిమ కొరత సృష్టించి, అనివార్యంగా రైతును అదనపు ధాన్యం ఇచ్చేందుకు ఒప్పిస్తున్నారు. ఇందులో కొనుగోలు సిబ్బంది, అధికారులు సూత్రధారులే. మిల్లులపై దాడులు చేస్తే, వాస్తవంగా బీజీల కొరత ఉన్నది, లేనిదీ తేటతెల్లమవుతుంది. దీనిపై జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాం. కొత్త పద్ధతుల్లో మిల్లర్లు దోపిడీ చేస్తే చూస్తూ ఊరుకోం.

– బి.రాంబాబు,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

రైతు సేవా కేంద్రం ఎదుట పడిగాపులు కాస్తున్న రైతులు (ఫైల్)

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో ఎసిబి సోదాలు

భోగాపురం ప్రైవేట్ ఏజెంట్ ఇంట్లోనూ తనిఖీలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్, భోగాపురం

భోగాపురం సబ్ రిజిస్ట్రార్ పి.రామకృష్ణ ఇంట్లో ఎసిబి అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. విజయనగరంలో ఉన్న ఆయన ఇంటితో పాటు భోగాపురంలోని ఓ ప్రైవేటు ఏజెంట్ ఇంట్లోకూడా తనిఖీలు చేపట్టారు. ఇరవై రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించారు .రామకృష్ణ మొబైల్స్, పలు కీలక డాక్యుమెంట్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో దొరికిన ఆధారాలతో సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ నివాసాలపై ఎసిబి డిఎస్‌పి ఎన్.రమ్య ఆధ్వర్యాన సిఐ మహేష్, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పలు కీలక ఆధారాలను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మరోవైపు భోగాపురంలో ఓ ప్రైవేట్ ఏజెంట్ ఇంట్లో 15 లక్షల నగదును, బంగారాన్ని, కొన్ని ఆస్తి పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో సోదాలు చేస్తున్న ఎసిబి అధికారులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ఏసు మార్గం అనుసరణీయం
కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యేసు ప్రభువు త్యాగం అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కొనియాడారు. సాటి మనుషులపట్ల ఆయన చూపి ప్రేమ, కరుణ అనుసరణీయమని పేర్కొన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సుమారు 2వేల ఏళ్ల క్రితమే యేసు త్యాగం, ప్రేమ, కరుణలతో ప్రజలందరికీ ఒక మార్గం చూపారని తెలిపారు. తనకు హాని చేయడానికి వచ్చిన వారిని క్షమించడం, ఆయన క్షమాగుణానికి నిదర్శనమని అన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, మైనారిటీ సంక్షేమశాఖ ఇడి షేక్ మహబూబ్ షరీఫ్, క్రిష్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి. ప్రేమానందం, రెవరెండ్ పిల్లా ఆనంద్‌బాబు, రెవరెండ్ ఎస్.మధుతోపాటు పలువురు క్రైస్తవ ప్రతినిధులు మాట్లాడారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకును అధికారులు, ప్రజాప్రతినిధులు కట్ చేశారు.

సేవా మార్గంలో పయనించాలి : కోలగట్ల

జీసస్ చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని శాసనసభ మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. కోలగట్ల నివాసంలో వైసిపి క్రైస్తవ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనారిటీలకు చేసిన మేలు మరువలేనిదని అన్నారు. ప్రజలందరూ ప్రేమ, సంతోషం, ఐక్యత కలిగి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం రెడ్డి బంగారు నాయుడు, నగర అధ్యక్షులు

కేక్‌ను కట్ చేస్తున్న కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్సీ తదితరులు

ఆశపు వేణు, కౌశిక్ ఈశ్వర్ దంపతులు, వైసిపి స్థానిక కార్పొరేటర్లు, పాస్టర్ బిఎం రాజు, ప్రేమానంద్, బలివాడ రాజేంద్రప్రసాద్, ఎస్. మధు, అర్.మధు మనోహర్ , మైనార్టీ టౌన్ అధ్యక్షులు చిట్టి తదితరులు పాల్గొన్నారు.

సీతంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యుఇఎస్‌ఐ స్టాఫ్ బ్రదర్ ఆర్.రాజ్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్నిఅందించారు. యేసుక్రీస్తు ప్రేమ, క్షమ, సేవా గుణాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఎలా ప్రతిబింబించాలో వివరించారు. కళాశాల కారస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, మానవ సేవల గొప్పతనాన్ని చాటిచెప్పే పవిత్ర పండగ క్రిస్మస్ అని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డివి రమణమూర్తి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న అప్పారావును పరామర్శిస్తున్న తమ్మినేని తదితరులు

రోడ్డు ప్రమాదంలో గాడి అప్పారావుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- కొత్తవలస

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు మండలంలోని జిందాల్ పరిశ్రమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గాంధీనగర్‌కు చెందిన అప్పారావు మంగళవారం ఉదయం ప్రజాశక్తి పత్రిక పంపిణీ చేసేందుకు మండలంలోని నిమ్మలపాలెం వద్దగల జిందాల్ కంపెనీ గేటు ముందు పేపరు కట్ట తీసుకొని బయలు దేరుతుండగా లక్కవరపుకోట మండలం జమ్మాదేవిపేటకు చెందిన యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి అప్పారావును బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో అప్పారావుకు కుడి చేయి, కుడికాలు విరిగిపోయాయి. వెంటనే స్థానికుల సహకారంతో ఎస్.కోట పట్టణంలోని సాయి కృష్ణ ఆస్పత్రికి తరలించారు. లక్కరపుకోట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ప్రజాశక్తి మేనేజర్ సిహెచ్ రాము, రైతు సంఘం నాయకులు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్, సిపిఎం ఎస్.కోట మండల కార్యదర్శి మద్దిల రమణ తదితరులు అప్పారావును పరామర్శించారు.

జాతీయ స్థాయి పూమ్సే తైక్వాండోలో బ్రాంజ్ పతకం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా పోలీసుశాఖలోని ట్రాఫిక్ కానిస్టేబులుగా పని చేస్తున్న బిఎస్ఎన్‌మూర్తి ఇటీవల తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లో జరిగిన 14వ జాతీయ స్థాయి సీనియర్ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలవగా ఆయన బిఎస్ఎన్‌మూర్తిని అభినందించారు. స్పోర్ట్స్‌లో ఎక్కువ కాలం రాణించాలంటే శారీరక దృఢత్వం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యం కాపాడుకుంటూ రానున్న రోజులలో మరిన్ని పతకాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో జట్లకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24 నుండి 26 వరకు గుడివాడలో జరగబోయే సీనియర్ అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో పాల్గొనే విజయనగరం జిల్లా స్త్రీ పురుషుల జట్టు మంగళవారం బయలుదేరి వెళ్లాయి. ఈ సందర్భంగా పురుషుల జట్టుకు మూడో వార్డు కార్పొరేటర్ వజ్రపు శ్రీనివాసరావు, మహిళల జట్టుకు సత్య డిగ్రీ కళాశాల కిట్లు పంపిణీ చేశాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వజ్రపు శ్రీనివాస్ రావు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సత్యవేణి, అధ్యక్షులు కమల నాభరావు, కార్యదర్శి గోపాల్ వైస్ ప్రెసిడెంట్ రామారావు, చిన్నంనాయుడు, పీడీ ప్రసాద్, బైరెడ్డి శీను, సూరపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ టెక్నాలజీపై ఉపన్యాసం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైజర్ కోర్స్‌లో చేరిన విద్యార్థులతో మంగళవారం క్వాంటమ్ టెక్నాలజీపై వీడియో కాన్ఫరెన్సులో ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55,000 మంది సాంకేతిక విద్యార్థులు పాల్గొని, క్వాంటమ్ వ్యాలీ ప్రాముఖ్యత, క్వాంటమ్ సాంకేతికత భవిష్యత్ అవకాశాలు, వాటి వినియోగాలపై మార్గదర్శనం పొందారు. జెఎన్‌టియుజివి వైస్‌ఛాన్సలర్ ఆచార్య వివి సుబ్బారావు, రిజిస్ట్రార్ జి.జయసుమ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దళితులపై నిర్లక్ష్యం ఎందుకు?

- చట్ట విరుద్ధంగా అత్యాచార బాధితుల పేర్లు బహిర్గతం
- పోక్సో, అట్రాసిటీ బాధితులకు పరిహారం చెల్లింపులో జాప్యం
- అంటరానితనం, సామాజిక బహిష్కరణ ఆర్‌డిఒ, డిఎస్‌పిలకు పట్టదా?
- విజిలెన్స్ కమిటీ సమావేశంలో అధికార యంత్రాంగాన్ని కడిగేసిన సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'దళితులపై నిర్లక్ష్యం ఎందుకు..? అత్యాచార బాధితుల పేర్లు బహిర్గతం చేసే హక్కు అధికారులకు ఎవరిచ్చారు? అంటరానితనం, సామాజిక బహిష్కరణ వంటివి ఆర్‌డిఒ, డిఎస్‌పిలకు పట్టవా? అంటూ విజిలెన్స్ అండ్ మాటరింగ్ కమిటీ సభ్యులు అధికార యంత్రాంగాన్ని నిలదీశారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై ఒక్కటి మినహా మిగిలిన అంశాలకు ఎందుకు పరిష్కారం చేయలేదు అంటూ నిలదీశారు. జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ, మాన్యువల్ స్కావెంజర్ నిరోధక, పునరావాస చట్టంపై కలెక్టర్ రామ సుందరరెడ్డి అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు తెల్లముఖం వేయడం గమనార్హం. సమావేశంలో తొలుత అక్టోబర్ 22న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. అత్యాచార బాధితుల పేర్లు, చిరునామాతో సహా బహిర్గతం చేయడం అధికారులకు తగదని కమిటీ సభ్యులు పి.చిట్టిబాబు మండిపడ్డారు. ఇది జాతీయ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, సుప్రీం కోర్టు తీర్పు ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఇది అధికార యంత్రాంగం నిర్లక్ష్యమేనన్నారు. క్రమశిక్షణా చర్యలకు పట్టుబట్టడంతో కలెక్టర్ అందుకనుగుణంగా ఆదేశాలిచ్చారు. గత సమావేశంలో చర్చించిన 16 అంశాల్లో గజపతినగరం మండలం కొత్త బగ్గాంలోని సెప్టెంబర్ 9న జరిగిన హత్య ఘటన విషయంలో పునరావాస కల్పన మినహా మిగిలిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోలేదన్నారు. అన్నింటికీ విచారణ చేస్తాం, చూస్తాం అంటూనే సంబంధిత అధికారులు దాటవేశారు. నెల్లిమర్ల మండలం వల్లూరు పంచాయతీ పరిధిలోని దళితులు ఫిషర్‌మెన్ కో-ఆపేటివ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, కమిషనర్ నుంచి సర్టిఫికెట్ కూడా వచ్చినప్పటికీ కానీ, లీజ్ ఆర్డర్ జారీకి అధికారులు ఆటకం కల్పించారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్య అట్రాసిటీ యాక్టు ప్రకారం నేరమేనని గుర్తుచేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ వారం రోజుల్లో ఈసమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధితులకు చెల్లించాల్సిన రూ.72లక్షల పెండింగ్ ఉందన్నారు. చట్ట ప్రకారం వారం రోజుల్లో చెల్లించాల్సి వున్నప్పటికీ ఏళ్ల తరడి 49 కేసుల్లో 68మంది బాధితులకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో అంటరానితనం వివక్ష కొనసాగుతున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. భోగాపురం మండలం ముంజేరు దళితులు తమ సమస్యలు పరిష్కరించాలని 18రోజులుగా రిలే నిరసన దీక్షలు చేస్తున్నారని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. చాలా గ్రామాల్లో దళితులకు ప్రత్యేక స్మశానాలు లేక ఇబ్బందులు పడుతున్నా రని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అన్ని ఎస్.సి కాలనీలలో తనిఖీ చేసి శ్మశానాలు ఎక్కడెక్కడ లేవో పరిశీలించి నివేదిక పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ నిధులతో శ్మశానాలు, వాటికి రోడ్లు నిర్మాణానికి మంజూరు చేస్తామని తెలిపారు. ఇక నుంచి అత్యాచారం, అంటరానితనం జరిగిన సంఘటన సందర్భాల్లో ఆర్డీఒ, డిఎస్పీ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి నెలా 30న అన్ని మండలాల్లో ఎస్‌హెచ్‌ఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్‌డే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌పి ఎఆర్ దామోదర్ జెసి సేదు మాధవన్, అదనపు ఎస్‌పి సౌమ్యలత, డిఆర్‌ఒ మురళి , డిఎస్‌పిలు, ఆర్‌డిఒలు, సోషల్ వెల్ఫేర్ డిడి అన్నపూర్ణమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి -విజయనగరంకోట

ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం సమావేశం జరిగింది. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టులు, జాతీయ రహదారి 516(బి), కుర్ధారోడ్-విజయనగరం మూడో రైల్వే లైన్, విజయనగరం-సంబల్‌పూర్ 3వ రైల్వేలైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. గుర్ల స్టీల్‌ప్లాంట్, ఐటి పార్కులకు భూ సేకరణ, పతంజలి, మామహామాయచ, ఒబెరాయ్ హోటల్స్‌కు రహదారి తదితర అంశాలపైనా ఆరా తీశారు. వీటన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజన విశ్వవిద్యాలయంలో విద్యుత్ లైన్లను వెంటనే తొలగించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిఆర్‌ఒ ఇ.మురళి, ఆర్‌డిఒలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్, ఎస్‌డిసిలు కళావతి, ప్రమీలాగాంధీ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, రైల్వే తదితర శాఖల అధికారులు, ఎల్‌ఎ డిటిలు పాల్గొన్నారు.

బోర్లు మరమ్మతులు పూర్తి కావాలి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానున్న వేసవి కన్నా ముందే బోర్ల మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. దీంతో ఇంజినీరింగ్ సిబ్బంది మరమత్తులకు గురైన బోరింగ్ ల వివరాలను సేకరించి ప్రాధాన్యత క్రమంలో వాటి మరమ్మత్తు పనులు చేపడుతున్నారు. మంగళవారం లంకాపట్నం వద్ద మరమ్మతులకు గురైన బోరింగును సరి చేశారు. ఈ సందర్భంగా కమిషన్ పలు సూచనలు చేశారు. బోరింగ్ చుట్టూ చెత్తాచెదారాలు లేకుండా, నీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే బోరింగ్ చుట్టూ కాంక్రీట్ వేసి దిమ్మలు కట్టాలని సూచించారు.

వీధి దీపాలు సమస్య రాకుండా చర్యలు

అవసరమైన ప్రతి చోటా వీధి దీపాల ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆయన ఆదేశాలతో డిఇలు శ్రీనివాసరావు, రత్నాకర్ పలు ప్రాంతాల్లో పర్యటించి వీధి దీపాల ఏర్పాటుకు సమాలోచనలు జరిపారు. రవీంద్ర పార్క్ వద్ద మరమ్మతులకు గురైన వీధి దీపాలను సరి చేశారు. అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.

సచివాలయాన్ని పరిశీలించిన కమిషనర్

నగరంలోని కణపాకలో ఉన్న 54 వ నెంబర్ సచివాలయాన్ని కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదులు పరిష్కారం ఏ విధంగా చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

క్వాంటం టెక్నాలజీతో లక్ష మందికి ఉపాధి

యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపి

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలో జనవరి 1 నుంచి క్వాంటం టెక్నాలజీ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని, దీనివల్ల లక్ష మంది యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు తెలిపారు. మంగళవారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు నూతన నైపుణ్యాల కోసం త్వరలో క్వాంటం టెక్నాలజీ కోర్సులను కూడా అందించనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. ఈ మేరకు టెక్ విద్యార్థులు క్వాంటం, ఎఐ రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకునేలా వారికి శిక్షణ ఇప్పించడంతోపాటు... పాఠశాల స్థాయి నుంచే క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించా రన్నారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే పోలీసులను, అధికారులను జైలులో పెడతామని చేస్తున్న బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. చట్టసభల్లో ప్రజా ప్రతినిధులు లేకపోయినా కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ప్రజా సమస్యలపై వినతులు ఇస్తూ పోరాటాలు చేస్తున్నారని, వారిని చూసైనా నేర్చు కోవాలని వ్యాఖ్యానించారు. సమావేశంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల జ్యోతిని వెలిగిస్తున్న చైర్మన్ కె.సీతయ్య, డైరెక్టర్లు

వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టిపిఎల్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక కోరుకొండ వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో టిపిఎల్ పేరుతో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. పోటీలను ఆంధ్ర మాజీ రంజీ క్రీడాకారుడు సన్యాసిరాజు ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో మొత్తంగా 10 టీమ్‌లు 2 విభాగాలుగా పోటీపడుతున్నాయి. మొత్తంగా ఈ టోర్నమెంట్‌లో సుమారు 130 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ ప్రారంబోత్సవంలో ముఖ్యఅతిధి సన్యాసిరాజు మాట్లాడుతూ పిల్లల్లో క్రీడా నైపుణ్యాలు, శారీరక నైపుణ్యాలు పెంపొందించాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నేటి పుస్తకం భట్టీ పట్టే విద్యా విదానానికి వ్యతిరేకంగా, పిల్లలో హోలిస్టిక్ డెవలప్మెంట్ , సామాజిక, నైతిక విలువలను పెంపొందిస్తూ శారీరక, మానసిక నైపుణ్యాలను పెంపొందించే విధంగా తమ పాఠశాలలో విద్యా విదానం ఉంటుంది అన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న విద్యార్థులను పాఠశాల చైర్మన్ .కె.సీతయ్య, పాఠశాల డైరెక్టర్లు టి. వీరాస్వామి , కె. విజయలక్ష్మి అభినందించారు.

నిరుపేద పిల్లలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ముగ్గురు నిరుపేద పిల్లలకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్స్) తరఫున కొత్త బట్టలను సైలాడ శ్రీదేవి చేతుల మీదుగా అందజేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ తెలిపారు. మంగళవారం కొండ కరకాం గ్రామానికి చెందిన బంగారు లక్ష్మి, రాము, వరలక్ష్మి తల్లిదండ్రులను కోల్పోయి విజయనగరం రెయిన్‌బో ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న స్పెక్ట్ ప్రతినిధి శివాజీ ..చైర్మన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మికి తెలియజేయడంతో సంస్థ తరఫున ఆమె చేసిన సహకారంతో కొత్త బట్టలు, జామెట్రీ బాక్స్, పెన్నులు పెన్సిళ్లు అందజేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, జెసి సేధు మాధవన్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్, జెసిలను ఆయన కలిశారు. రైతులు నుంచి మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకోకుండా చూడాలని కోరారు. నియోజకవర్గం సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలను ఎంఇఒ ఎన్.నాగభూషణరావు మంగళవారం సందర్శించారు. ఇందులో భాగంగా పదో తరగతికి బోధిస్తున్న ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. 100 డేస్ యాక్షన్ ప్లాన్ ఏ విధంగా అమలు జరుగుతున్నది పరిశీలించి ప్రతిరోజు కండక్ట్ చేసే టెస్ట్ మార్కులను పరిశీలించారు. ప్రతి టీచర్ వద్ద విద్యార్థుల డీటెయిల్ సమాచారం ఉండాలని సూచించారు. రైజింగ్ స్టార్‌లో ఉన్న విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా ఏ విధంగా తీసుకురావాలి అనేది యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రెడ్‌క్రాస్ ఏర్పాటుకు ఆదేశాలివ్వండి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో జూనియర్ రెడ్ క్రాస్ ఏర్పాటుకు ఆయా స్కూల్స్‌ను రెడ్ క్రాస్ సంస్థకి అసోసియేట్ అయ్యేలా ఆదేశాలు జారీ చేసి ఆయా స్కూల్లో కోఆర్డినేటర్‌ల నియామకం చేపట్టేలా స్కూల్ హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇవ్వాలని ఎంఇఒను కోరామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్‌కోట బ్రాంచ్ చైర్మన్ పి.వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర బ్రాంచ్ ఆదేశాల మేరకు వారు పంపించిన రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్స్‌ను ఎంఇఒకి ఇచ్చామన్నారు.

బొడ్డవరలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు మండలంలోని గిరిజన గ్రామమైన మూల బొడ్డవరలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలో శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించామని ఎన్‌ఎస్‌ఎస్ పిఒ డి.దాలిబాబు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి తెలిపారు.

అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

చెకుముకి పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - రాజాం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో కాకినాడ జెఎన్‌టియు కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పట్టణంలోని ది సన్ స్కూల్ విద్యా సంస్థ ప్రిన్సిపల్ వై.భారతి తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన తమ్మినేని సాత్విక్ (10వ తరగతి), మరిశర్ల జగదీష్ (9వ తరగతి), దువ్వు హర్షిత (8వ తరగతి) చెకుముకి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికవడం హర్షణీయమన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు పి. ప్రవీణ్‌కుమార్, వై. దుర్గారావు, సైన్స్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

జన సైనికులంతా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జనసేన బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మండల జన సైనికులతో కలిసి నరసాపురం, కొండకెంగువ గ్రామాల్లో పర్యటించి ఎన్నికలకు సిద్ధం కావాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని అన్ని గ్రామాల్లో కూటమి సానుభూతి పరులే గెలుపొందాలని గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించేలా కార్యకర్తలు ఇప్పటి నుండే కృషి చేయాలని అన్నారు. సమర్థులైన వ్యక్తులను గుర్తించి పోటీల్లో నిలిపి వారి గెలుపునకు చేయూత నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కనకల శ్యామ్, అల్లు రమేష్, ఉల్లి సంతోష్, దత్తి శ్రీను, కల్లి రాము, ఎనగల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

యుటిఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, నాయకులు జి రాజారావు, జి వెంకట్రావు సమక్షంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. అనంతరం మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా రామసత్యం, అధ్యక్షులుగా ఎం.తాతనాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.చిరంజీవి, సహ అధ్యక్షులుగా వి.నాయుడు, మహిళా సహ అధ్యక్షులుగా డి. సత్యవతి, కోశాధికారిగా డి. ప్రసాద్, కార్యదర్శులుగా కె.సురేష్, రామారావు, ఎస్ అప్పలనాయుడు, బి.వెంకటరావు, సిహెచ్ దేవి, డి.జగదీష్, బి.సూర్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎస్.గోవింద్, డి. రాము, వి త్రినాథ్, జి.అవతారం, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎం.సతీష్, రాముడు ఎన్నికయ్యారు.

సృజనాత్మక విద్యను అందించాలి

రేగిడి: ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు సృజనాత్మక విద్యను అందించాలని ఎంఇఒ ఎం.వరప్రసాదరావు సూచించారు. ఈ మేరకు ఉణుకూరు ప్రాథమిక పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఉన్నత ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు వేడి ఆహారం, మంచినీరు అందించాలన్నారు. సమయానికి పాఠశాలకు హాజరు కావాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం పనితీరు మెరుగుపరచాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు నాగరాజు, చక్క వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లను ఏర్పాటు చేయండి

శృంగవరపుకోట: పట్టణంలోని పాత బస్టాండ్ దగ్గర వృథాగా ఉన్న ప్రయాణికుల సేవా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని డాక్టర్ విప్లవ్ శేషగిరి పంచాయతీ కార్యనిర్వహణాధికారిని, ఆర్‌టిసి డిపో మేనేజర్‌ను మంగళవారం కోరారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉండే ప్రజలకు బస్ స్టాప్ సదుపాయం కల్పించే బాధ్యత ఆర్‌టిసి డిపో అధికారులు, పంచాయతీ అధికారులు చూడాలని పంచాయతీరాజ్ యాక్ట్ సెక్షన్ 46 ప్రకారం పంచాయతీ ప్రజలకు బస్ స్టాప్స్ కల్పించే బాధ్యత కూడా తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. పూర్వం నుంచి కూడా అరకు వెళ్లడానికి అంబేద్కర్ విగ్రహం పక్కన బస్ స్టాప్ ఉండేదని ఆ ఎసెంట్ తొలగించారని విచారణ చేపట్టాలని, పాత బస్‌స్టాప్ వద్ద ఉన్న షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో తొలగించి తిరిగి నిర్మించలేదని అక్కడ వెంటనే బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

మూతపడ్డ పశువైద్యశాల

◆ఇబ్బందులు పడుతున్న పాడి రైతులు

◆పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- వంగర

పాడి పశువులకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మండలంలోని పెద్దరాజుల గుమ్మడలో గల పశు వైద్యశాలకు ఈ ఏడాది మేలో ఇన్‌ఛార్జి వైద్యుడుని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ వైద్యాధికారి ఇక్కడకు రాకపోవడం, కనీసం సిబ్బంది కూడా ఎవరూ లేకపోవడంతో అక్కడ ఉన్న పశు వైద్యశాల పూర్తిగా మూతపడింది. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పెద్ద రాజుల గుమ్మడ పశువైద్యశాలకు వైద్యుడ్ని నియమించి పాడి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

మండలంలోని పెద్దరాజుల గుమ్మడలో గల పశు వైద్యశాల పరిధిలో వివిఆర్‌పేట, చిన్న రాజుల గుమ్మడ, రుషింగి, బంగారు వలస, కొండ చాకరాపల్లి తదితర మొత్తం 14 గ్రామాలకు పెద్ద రాజుల గుమ్మడలో గల పశు వైద్యశాల నుంచి పాడి పశువులకు వైద్య సేవలు అందించవలసి ఉంది. మండల కేంద్రంలో గల పశువైద్య కేంద్రానికి చెందిన రెగ్యులర్ వైద్యాధికారి వెంకటరమణను పెద్ద రాజుల గుమ్మడ పశు వైద్యశాలకు ఇన్‌ఛార్జి వైద్యునిగా మే నెలలో బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన వంగర, పెద్ద రాజులగుమ్మడ వైద్యశాలకు ఏనాడూ రాలేదు. డిప్యూటేషన్‌పై మరో చోటకు వెళ్లిపోయారు. ఇది ఇలా ఉండగా సంతకవిటి మండలంలోని గుల్ల సీతారాంపురంలో పశువైద్యాధికారిగా పనిచేస్తున్న మజ్జి అనిల్ కుమార్‌ను రాజుల గుమ్మడకు ఇన్‌ఛార్జిగా వేసినప్పటికీ ఆయన కూడా ఏనాడూ ఇక్కడ విధులు నిర్వహించిన పరిస్థితి లేకపోవడంతో పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూతపడిన పశువైద్య శాల

సిబ్బంది కూడా లేని పశు వైద్యశాల ఎందుకు..?

పెద్దరాజులుగుమ్మడలో గల పశువైద్యశాలలో వైద్యాధికారి లేరు సరే కదా కనీసం సిబ్బందిని కూడా ఈ పశు వైద్యశాలకు వేయకపోవడంతో పాడి రైతులు సమస్యలు పట్టించుకునే వారు కరువయ్యారని పాడి రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సమస్యలు పట్టని అధికారులు

ప్రభుత్వం పాడి పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అసలే వ్యాధుల కాలం, పాడి పశువులకు అనేక వ్యాధులు సోకుతున్నప్పటికీ ఈ ప్రాంతంలో వాటి ఆరోగ్య పరిస్థితిపై పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ప్రధానంగా మండలంలో పలు గ్రామాలలో ఇటీవల గొర్రెల పైన, ఆవుల పైన కుక్కలు దాడులు అధికంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఇటువంటి సమయంలో పాడి పశువులకు సరైన వైద్యం అందితే పశుప్రాణనష్టం ఇంత జరిగి ఉండేది కాదని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రాజులగుమ్మడలో గల పశువైద్యశాలకు వైద్యుడును నియమించి పశువైద్యశాల తెరిపించి పశు వైద్యసేవలు అందేవిధంగా చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై సంతకవిటి ఎడి తిరుపతిరావును వివరణ కోరగా పెద్ద రాజుల గుమ్మడలో గల పశువైద్యశాలకు పశువైద్యాధికారి, సిబ్బంది ఎవరు లేకపోవడంతో మూతపడి ఉందని స్పష్టం చేశారు.0

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో యజమానులు విజయనగరంలోనికి వెళ్లే ప్రతి ఒక్క ఆటో, మ్యాక్సీ క్యాబ్ వంటి వాహనాలకు సీరియల్ నెంబర్లు ఉండాలన్నారు. మండలంలోని గునుపూరుపేట ఆటో స్టాండ్ వారికి సీరియల్ నెంబర్లు కేటాయించి ఆటోలకు వేయించారు. ఆటో డ్రైవర్లు రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు లైసెన్సు, సి బుక్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పాసింజర్స్ పట్ల గౌరవింగా మెలగాలని తెలిపారు. ఆటో డ్రైవర్స్ ఎలాంటి అవాంఛనీయ క్రైమ్ లో పాలుపంచుకోకూడదని హెచ్చరించారు. ఆటోలలో గంజాయి, మత్తు పదార్థాలు వంటివి రవాణా చేస్తే ఆటోను సీజ్ చేయడమే కాకుండా డ్రైవర్‌కు నాన్‌బెయిల్ బుల్ కేసులు పెట్టి జైలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి- రాజాం

మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం 333 మంది అంగన్వాడి కార్యకర్తలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ 5జి సెల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల పని భారాన్ని తగ్గించి, వారికి సాంకేతిక బలాన్ని అందించడానికి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మిక నిర్ణయమని తెలిపారు. దీని ద్వారా గ్రామీణ స్థాయిలో పోషణ, ఆరోగ్య సేవల అమలు మరింత పారదర్శకంగా, వేగంగా జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న 236 మంది అంగన్వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు మంగళవారం 5జీ స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. మిని అంగన్వాడీ కార్యకర్త నుండీ మెయిన్ అంగన్వాడీ పదోన్నతి పొందిన వారికి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ కోళ్ల వెంకటరమణ (శ్రీను), ఎంపిపి గేదెల శ్రీను, తహశీల్దార్ రమేష్, ఎంఇఒ కూర్మారావ్, సర్పంచ్ కెర్రు పార్వతి, సిడిపిఒ ఆర్.ఉమాదేవి, ఎసిడిపిఒ బి.లక్ష్మి బాయ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

26 నుంచి క్రికెట్ టాలెంట్ హంట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ మైదానంలో టాలెంట్ హంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరాజు మంగళవారం తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి, టాలెంట్ హంట్ సభ్యులు కె. రవిశంకర్ పర్యవేక్షణలో ఈ నెల 26నుంచి 31వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 26, 27 తేదీల్లో అండర్- 12, అండర్ -14 విభాగం, 28, 29తేదీల్లో అండర్16, 19 విభాగాలకు చెందిన క్రీడాకారులకు టాలెంట్ హంట్ నిర్వహిస్తామన్నారు. 30, 31 తేదీల్లో అండర్-19 ఆ పైన (సీనియర్స్) విభాగాలకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే టాలెంట్ హంట్ కార్యక్రమానికి హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని కోరారు.

మ్యాపింగ్‌తో పల్స్ పోలియో విజయవంతం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో మ్యాపింగ్ ద్వారా మంగళవారం ఇంటింటికీ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ పల్స్ పోలియోలో సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట, ఉంగరాడమెట్ట, బూరాడ, కొర్ల వలస, తాటిపాడుతో పాటు పలు గ్రామాల్లో మిగిలిపోయిన చిన్నారులకు ఏఎన్ఎం జ్యోతి, అంగన్వాడి కార్యకర్త శాంతి పల్స్ పోలీస్ చుక్కలు వేశారు. దీంతో శతశాతం పల్స్ పోలియో విజయవంతమైనట్లు వైద్యాధికారులు రీనా చౌదరి, అసిరి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విస్తరణ అధికారి రాధాకృష్ణ, సుందరేశ్వరరావు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

మురుగు కాలువగా మారిన రోడ్డు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొంపల్లి ప్రధాన రహదారి మురుగు కాలువను తలపిస్తోంది. రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉన్నప్పటికీ గత్యంతరం లేక అందులో నుంచే గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేకపోవడంతో ఇరువైపులా ఉన్న గృహస్తులు వాడుకునే నీరు రోడ్డుపైకి వచ్చి నిల్వ ఉండిపోయి మురుగు కాలువను తలపిస్తోంది. గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ప్రజలను నమ్మించి గెలిచిన సర్పంచ్ ఎల్.అరుణ, అదే గ్రామానికి చెందిన ఎంపిటిసి, ప్రస్తుత ఎంపిపి దొంగ సత్యవంతుడు రోడ్డు గురించి పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ నిధులతో ప్రజాప్రతినిధుల కల్లాలకు, వారి భూముల్లో ఉన్న తోటలకు రోడ్లు వేసుకుంటున్నారే కానీ ఊరు మధ్యలో పూర్తిగా మరమ్మతులకు గురైన రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం సచివాలయం, ఆర్‌ఎస్‌కె భవనాలకు వెళ్లేందుకు కూడా సరైన రహదారి లేకపోవడంతో ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని జరుగుతున్నా సర్పంచ్, ఎంపిపి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో వీరిద్దరికీ తగిన బుద్ధి చెబుతామని గ్రామస్తులు బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు.

మురుగు కాలువను తలపిస్తున్న ప్రధాన వీధి

వృథాగా తాగునీరు

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో సర్పంచ్, అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భర్తాపురం కాలనీ వాసులు వాపోతున్నారు. కాలనీలో గల మంచినీళ్ల ట్యాంక్ పగిలిపోయి నీరు వృథాగా పోతుందని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని డ్రైనేజీ లేక నీరు పోయే మార్గం లేక నీరు రోడ్లపైనే నిలువ ఉండి మురుగనీరుగా తయారవుతుందని ఈ నీటి వల్ల మురుగు నీరు వాసన, దోమలు బెడదతో అంటువ్యాధులు వస్తాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సర్పంచ్, అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా గ్రామస్తులకు సక్రమంగా తాగునీరు అందించాలని వాటర్ ట్యాంక్‌ను మార్చి కొత్తగా వాటర్ ట్యాంక్ నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

టిడిపిలో 20 కుటుంబాలు చేరిక

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి పంచాయతీలో వైసిపికి చెందిన 20 కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. గ్రామ టిడిపి నాయకుడు చెల్లూరి సత్యారావు సమక్షంలో పార్టీలోకి చేరిన వీరందరికీ టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ బోడసింగి సత్తిబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పోతల శ్రీను, పోతల రవి, నేరేడుబిల్లీ శ్రీను, నేరడబిల్లి పైడితల్లి, అప్పికొండ సురేష్, బెజ్జపల్లి నాగరాజు, శ్రీను, ఈశ్వరరావు, రాయల తిరపతి, గంటా శ్రీనురాజు మాట్లాడుతూ కూటమి పాలన నచ్చి పార్టీలో చేరామన్నారు.

ఈవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు వేసిన సీళ్లను, తాళాలను తెరిపించి లోపలి గదులను, ఈవిఎం పెట్టెలను పరిశీలించారు. పోలీసు బందోబస్తుపై సమీక్షించారు. సిసి కెమేరాల ద్వారా చుట్టుప్రక్కల పరిస్థితులను పరిశీలించారు. అంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిఆర్ఒ ఇ.మురళి, ఆర్‌డిఒ డి.కీర్తి, నెల్లిమర్ల తాహశీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఇంచార్జి ఎన్నికల సూపరింటిండెంట్ ప్రసాదరావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.లక్ష్మీవరప్రసాదరావు, సముద్రాల రామారావు, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

అనాథ బాలికలకు సైకిళ్లు వితరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అనాథ బాలికలకు వికె ఫ్యామిలీ ఫౌండేషన్, రాజస్థాన్‌కు చెందిన కోగ్త ఫైనాన్స్ సహకారంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన అనాథ బాలికలకు 35 సైకిల్స్ వితరణగా అందజేశారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం గోపాలనాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య, విశ్రాంత హెచ్‌ఎం డాక్టర్ భాస్కరరావు పాల్గొని సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికె ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సాహించటంలో భాగంగా అమెరి కాలోని డల్లాస్‌కు చెందిన రెల్లా శ్రీనివాస్ వికె ఫౌండేషన్ ద్వారా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న అనాథ బాలికల సైకిళ్ల పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దూర ప్రయాణ సమస్య వల్ల బాలికలు చదువు మధ్యలోనే ఆగిపోకుండా ఉండేందుకు ఈ సైకిళ్లు ఉపకరిస్తాయని అన్నారు. విద్యతోనే బాలికల జీవితాల్లో మార్పు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిలపర్తి దాలినాయుడు, శంకరరావు, శాంతి, ఉమ్మడి జిల్లాల్లోని వివిధ పాఠశాలల లబ్ధిదారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైకిళ్లను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- రేగిడి

వికలాంగ విద్యార్థులు ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ ఎం.వరప్రసాదరావు, ఆర్థోపెటిక్ వైద్యులు కంట సందీప్ అన్నారు. మండల కేంద్రం ఎంఆర్‌సి కార్యాలయంలో మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వరంలో వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ ఫిజియోథెరపీని ఎంఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న అవసరాలు గల వికలాంగ విద్యార్థులకు వైద్యులు చెప్పిన సూచన మేరకు తల్లి దండ్రులు తన ఫిజియోథెరిపీ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారి ఎం.నాగమణి, మండల భవిత కేంద్ర టీచర్స్ యు. మహేశ్వరి, టి.రాజేష్, కేర్ టేకర్ అనూరాధ, మండల జెఆర్ అసిస్టెంట్ అప్పలనాయుడు ఉన్నారు.

ప్రతి మతాన్నీ గౌరవిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

తాము ఎప్పుడూ ప్రతి మతాన్ని గౌరవిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని కొండ డాబాలు దగ్గర చర్చిలో ఆమె మంగళవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని మానవాళికి ఎంతో ఉపయోగాలు అని అన్నారు. అందరి కోసం పని చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తాము ఆలోచించేది పేదరికం లేని సమాజం కోసమని చెప్పారు. అనంతరం గొల్లలపాలెం గ్రామంలో కొండడాబాల ఫాదర్ డాక్టర్ గోంగాడ రాజు ఆధ్వర్యంలో ఆమె పాల్గొని కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల వెంకటరమణ (శ్రీను), కనకాల శివ, బొబ్బిలి అప్పారావు మాస్టర్, విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు లెంక శ్రీను, నక్కరాజు చినరాము, కోరుపల్లి అప్పారావు, ఉపేంద్ర, ఆర్కే రాజు, పాల్గొన్నారు.

వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

30 ఆలయాలకు టిటిడి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- రేగిడి

జిల్లాలో దరఖాస్తు చేసుకున్న గ్రామాల్లో శ్రీవాణీ ట్రస్ట్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలో 30 ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేసినట్లు జిల్లా తిరుమల, తిరుపతి దేవస్థానం ప్రోగ్రాం అధికారి శ్యామసుందర్ తెలిపారు. ఈ మేరకు సంకిలి గ్రామంలో రామాలయం నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30 ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటికి శ్రీవాణీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఆలయాలతో పాటు పంచలోహ విగ్రహాలు, మైక్ సెట్‌లు, ఇతర సామాగ్రి ట్రస్ట్ ద్వారా సహకారానికి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షణలో శ్రీవాణీ ట్రస్ట్ ఆలయాలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట టిటిడి సహాయకులు సిహెచ్ ప్రసాద్, సంకిలి ఆలయ కమిటీ ప్రతినిధులు బట్న తవిటినాయుడు, కొరికాన వెంకటేష్, రాయపురెడ్డి శ్రీకాంత్, గుండ రామకృష్ణ, దూబాసి కోదండరావు గ్రామస్తులు ఉన్నారు.

అనుమతి పత్రాలను అందిస్తున్న శ్యామ్‌సుందర్

మాట్లాడుతున్న లక్ష్మణరావు

రైతులకు అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని అలుగోలు గ్రామంలో రైతులకు సాగు యాజమాన్య పద్ధతులపై అధికార్లు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సమన్వయ కర్త కె.భారతి మాట్లాడుతూ జీవన ఎరువులు వాడకం, సేంద్రీయ వ్యవసాయం, బయో పెస్టిసైడ్, భూసారం పెంపుదల, ప్రభుత్వ లక్ష్యాలు గురించి వివరించారు. డాక్టర్ కె.లక్ష్మణరావు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కలుపు నివారణ, సమగ్ర పంటల సాగుకు సస్యరక్షణ, నానో యూరియా, నానో డిఎపి ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.తేజేశ్వర రావు, పి.నిర్మల, ఎఒ పి.శ్రీలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

చోరీ నిందితుడు అరెస్టు

రూ. 42,130 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాదిలో ఈనెల 13వ తేదీన 5 దేవాలయాలలో తాళం కప్పలు విరగగొట్టి లోపలకి చొరబడి హుండీల దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో మంగళవారం దొంగతనానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఒకేరోజు ఐదు ఆలయాల్లో దొంగతనం చేసిన వ్యక్తి కృష్ణరాయుడుపేట జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న విషయాన్ని గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్ఐ సుదర్శన్ తనదైన శైలిలో విచారించగా పెందుర్తి గ్రామానికి చెందిన పెందుర్తి నాగరాజు ఆ దొంగతనాలు తానే చేసినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఆలయాల్లో అపహరించిన రూ.42,130 నగదును స్వాధీనం చేసుకుని ఆయనను రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. ఈ కేసు ఛేదనంలో భాగస్వాములైన కానిస్టేబుల్స్ సురేష్, కనకరాజు, సంతోష్, నాయుడు, రాజు, శేషాద్రి నాయుడు సిబ్బందిని ఆయన అభినందించారు.

మహిళ ఆత్మహత్య

కంటోన్మెంట్: నగరంలోని అయ్యకోనేరులో పడి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం దాసన్నపేట నవాబువీధికి చెందిన దువ్వు సునీత(35)మానసిక వికలాంగురాలు. ఆమెకు వివాహమైనా పిల్లలు లేరు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె అయ్య కోనేరులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం మృత దేహం తేలడంతో స్థానికులు విజయనగరం టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM. O.S. No.118/2024.

Between:-
Sri Andavarapu Ramana Murthy .....Plaintiff.
And:
Smt. Pediredla Mahalakshmi etc., ...Defendants.
To:
4th DEFENDANT:-
Smt. Pediredla Ramanamma, W/o late Veerabadhram, Aged about 70 years, Household duties, Datti Village, Kothavalasa Mandal, Vizianagaram District.

Take notice that the above suit filed by the plaintiff for recovery of the amount due is posted to **20.01.2026 at 10:30 a.m.** before the above Honourable Court for your appearance, failing which the matter will be decided in your absence.

ADVOCATE FOR THE PLAINTIFF.
N.RAMESH KUMAR
ADVOCATE
MIG-1-180, PHASE-II,
Vuda Colony, Cantonment
VIZIANAGARAM

ప్రకటన
విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 18/2025

శ్రీమతి సంగిరెడ్డి ఈశ్వరమ్మ వగైరాలు ....వాదులు
శ్రీ పిల్లా వెంకటరమణ వగైరాలు ....ప్రతివాదులు
To
1. పిల్లా వెంకటరమణ S/o లేటు పైడితల్లి, వ్యవసాయం, గరుడబిల్లి గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.
2. పిల్లా పాపయ్యమ్మలు W/o వెంకటరమణ, గరుడబిల్లి గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.
3. సంగిరెడ్డి బంగారమ్మ W/o లేటు రాము, గరుడబిల్లి గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.
4. సంగిరెడ్డి అప్పలనాయుడు, S/o లేటు రాము, గరుడబిల్లి గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.
5. సంగిరెడ్డి రమణ S/o లేటు రాము, గరుడబిల్లి గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో వివరించిన షెడ్యూలు ఆస్తులు పంపకము చేసి, ఇందలి వాదులకు రావలసిన 1/3వ వాటా ఆస్తులను రాబట్టే నిమిత్తము మీపైని పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు ఆస్తుల పైని ఇందలి వాదులకు రావలసిన గత ఫలసాయములు రాబట్టే నిమిత్తమున్నూ పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. కావున సదరు దావాలో మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే 07-01-2026దిని పగలు 10-30ని॥లకు** మీరు స్వతహాగా లేక సరియైన బోగట్టా యివ్వబడిన వకీలు గారి ద్వారా గాని ఈ కోర్టులో హాజరయ్యి మీ ప్రతివాదనకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నింటిని మీ యొక్క స్టేట్‌మెంటుతో సహా దాఖలు చేసుకోవలసినదిగా కోరడమైనది. అట్లు కాని యెడల సదరు దావా మీ పరోక్షమందు విచారణ జరిపి తీర్మానించడము జరుగునని యిందుమూలముగా మీకు కోర్టువారి ఆర్డరు ప్రకారం తెలియజేయడమయినది.

కాగా యిది శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ప్రకటించడమైనది.

ఇట్లు
శ్రీ పోతుల రాంబాబు
వాది త॥ అడ్వకేట్,
విజయనగరం,
సెల్ : 9996458999